

— అంధవరపు మల్లిబాబు

సీతకి జ్వరం!

ఒంటిమీద స్పృహలేకుండా పడివుంది.

రెండు రోజుల క్రితం- అంటే జ్వరం మరీ యింత తీవ్రంగా వుండక పూర్వం, ధర్మాసుపత్రికి వెళ్ళి జ్వరానికి మందు తెచ్చుకోవాలనుకుంది సీత. కాని, గవర్నమెంట్ ఆస్పత్రిలో దొరికే రంగు నీళ్ళతో జ్వరం బాగవుతుందనే నమ్మకంలేక, ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. ఆ రోజే సీతకి జ్వరం ఎక్కువయింది. మూసిన కన్ను తెరవకుండా పడుకుంది. ఇటువంటి పరిస్థితిలో ఏ డాక్టరూ వచ్చి మందివ్వలేదు.

అందుకు కారణం సీత గొప్పోడికి పెళ్ళాంకాదు.

కపీసం ఉంపుడుగత్తె కూడా కాదు.

పేవ్‌మెంట్ మీదే జీవితాన్ని

వెళ్ళబుచ్చే ఓ అ భా గ్యు డి కి అర్ధాంగి.

ఆ అభాగ్యుడి పేరు సూరయ్య!

సూరయ్యకు న ల భై యే ళ్ళ వయస్సుంటుంది. మనిషిని చూడ గానే ఇంకా అతడిలో శ క్తి కా స్తంత వుందనిపి స్తుంది. అయితే అతడికి కాళ్ళులేవు. మురికిపట్టి చిరిగిన బట్టలతో, తై ల సంస్కా ర మెరుగని జుట్టుతో, దై న్యం నిండిన చూపులతో దౌర్భాగ్యానికి ప్రతినిధిలాగా కనిపిస్తాడు.

జ్వరంతో స్పృహతప్పివున్న భార్య సీతను బాధగా, నిస్సహా యంగా చూస్తూ కూర్చున్నాడు సూరయ్య.

మనసులో కుమిలిపోతున్నాడు.

తన చేతకానితనానికి తనను తాను కసిగా నిందించుకుంటున్నాడు, తిట్టుకుంటున్నాడు.

సీతకి జ్వరం వచ్చినప్పటినుండీ నిద్రాహారాలు మాని ఆమె ప్రక్కనే కూర్చుని వున్నాడు సూరయ్య. మాటమాటకీ భార్య నుదుటిమీద చెయ్యివేసి చూ స్తున్నాడు. కాలం గడు స్తున్నకొద్దీ జ్వరం ఎక్కువవు తుందిగాని తగ్గుముఖం పట్టలేదు. ఇటువంటి విపత్కర స్థితిలో ఏం చెయ్యాలో తోచడంలేదు.

సీత ఇక తనకు దక్కదేమో నన్న భయం పట్టుకుంది.

ఆ భయం సూరయ్యను నిలు వెల్లా వణికించింది.

సీత!

సీత తన భార్య!!

తన ప్రాణంలో ప్రాణం!!!

సీత చనిపోతే తను బ్రతగ్గలడా?

సూరయ్య కళ్ళు చెమ్మగిల్లేయి. హృదయాన్ని ఏదో అదృశ్య శ క్తి పిండుతున్నట్లనిపించింది.

వణుకుతున్న చేత్తో కళ్ళు తుడుచుకున్నాడు.

గతం కళ్ళముందు లీలగా కదిలింది.

పదేళ్ళ క్రితం....

ము ప్పై యే ళ్ళ వయసప్పుడు, సీత తన చీకటి జీవితంలోకి వెలుగు లాగ ప్రవేశించింది.

ఆ రోజు తనకు బాగా జ్ఞాపకం!

ప్లాట్‌ఫారమ్‌మీద సా మా న్లు మోస్తూ-కదిలే రై లును ఆత్రుతగా అందుకోబోయి, కాలుజారిపడ్డాడు. ఫలితంగా తన రెండు కాళ్లూ పోయేయి.

సరిగ్గా, అటువంటి సమయంలో దిక్కూ మొక్కూలేని తనను కంటికి రెప్పలాగ కాపాడింది సీత.

సీత సన్నగా, ఆకర్షణీయంగా వుంటుంది. తల్లిదండ్రులెవరో తెలి యని అనాధ.

రైళ్ళలో సినిమా పాటలు పాడుతూ అడుక్కుని బ్రతుకుతుంటుంది.

వయసులో పిట పిట లాడుతుండటంవలన సమయం దొరికినప్పుడల్లా సీతతో తను హాస్యాలాడేవాడు. ఆ విధంగా సీత పరిచయస్తురాలు. ప్రమాదంలో కాళ్ళు పోవడంతో సీత తనకు దగ్గరయింది.

"నీ లాగే నాకూ ఏ దిక్కూ లేదు. ఆడదాన్ని. నాకో మగాడు తోడు కావాలి. నీతో వుందామనుకుంటున్నాను. ఇష్టమేనా?" అని సూటిగా అడిగేసింది.

'నా' అనేవారు లేని తన అవిటి బ్రతుక్కి అంతకన్నా ఏం కావాలి?

బ్రతుకుమీద సన్నగిల్లుతున్న ఆశ సీత మాటలతో తిరిగి చిగురు తొడిగింది.

ఆ నాటినుండి ఈ నాటివరకు సీత కష్టంమీదనే తను బ్రతుకుతున్నాడు. అటువంటి సీత ఈనాడు కళ్ళుతెరవకుండా పడివుంది.

'ఒక వేళ సీతకి జరగకూడనిది ఏదన్నా జరిగితే ఇంకేమన్నా వుందా? తన గతేంకాను? సీత లేకపోతే తన బ్రతుకంతా చీకటైపోతుంది.' నిస్తేజంగా నిట్టూర్చాడు సూరయ్య. చెమ్మగిల్లిన కళ్ళను ఎడంచేత్తో తుడుచుకున్నాడు.

"ఏరా సూరిగా! సీత కెట్టాగుంది?" రామర్శించేడు పరిచయస్తుడైన పక్క పేవ్‌మెంట్ నివాసి.

"తగ్గనే దు మాఁవా! ఇంకా ఎక్కువైనాది" అన్నాడు దిగాలుగా.

"మంచోళ్ళకే కట్టాలొత్తాయిరా ...." సానుభూతిగా నిట్టూర్చాడు పేవ్‌మెంట్ పరిచయస్తుడు.

జేబులోనుండి సెకండ్ హేండ్ సిగరెట్‌ను తీసి, జాగ్రత్తగా వెలిగించుకుని రెండు దమ్ములులాగి, సూరయ్యవేపు తిరిగి—

"సూది మందు ఏయించలేకపోయావట్రా?" అనడిగేడు.

"ఏయించాలనే వుంది మాఁవా! కాని, డబ్బుల్లేవు...."

"నేనిత్తాన్లేరా. సీతకి నయమయినాక నా డబ్బుల్నాకు తిరిగిచ్చేదువుగాన్లే..." అన్నాడు.

వాడి పేరు ఏడుకొండలు!

సీతలాగే వాడి వృత్తి కూడా రైళ్ళలో పాటలు పాడి అడుక్కోవడమే.

అయితే, వీలు చిక్కినప్పుడల్లా జేబులు కత్తిరిస్తుంటాడు. అందువలన, వాడి సంపాదన బాగానే వుంటుంది.

దిగులుతో కృంగిపోతున్న సూరయ్యకు ఏడుకొండలు మాటలు ధైర్యాన్నిచ్చేయి. సీత జ్వరంతో

పడుకున్న దగ్గర్నించి గుర్తున్న దేవుళ్ళందర్నీ సిన్సియర్‌గా ప్రార్థించాడు. వాళ్ళంతా తన మొరాలకించి ఈ ఏడుకొండలు రూపంలో తనకు సహాయం చేయడానికి దిగివచ్చే రనిపించింది ఆ సమయంలో సూరయ్యకు.

వణుకుతున్న చేతులనుజోడించి, కృతజ్ఞతనిండిన స్వరంతో, "నువ్వు దేవుడివి కొండలు మా॥వా !" అన్నాడు.

ఆ మాటలకు ఏడుకొండలు నవ్వుకున్నాడు.

"బాగా పొద్దుపోయింది. డాక్టర్లెవరూ ఇప్పుడు వుండరు. రేపొద్దుటే సీతకి సూదిమందు ఏయించడానికి ఎల్దువుగాన్లే" అన్నాడు. పేవ్‌మెంట్‌కు ఒక ప్రక్కగా గుడ్డ పరుచుకుని పడుకున్నాడు.

* * *

తెల తెల్లగా తెలవారింది.

ఏ ఏడుకొండలవాడి సహాయమూ అక్కర్లేకుండానే సీత బ్రతుకు తెల్లవారింది.

సూరయ్య గుండె లవిసేలా ఘొల్లుమన్నాడు.

చంటి పిల్లాడిలాగే వెక్కి వెక్కి ఏడ్చాడు.

సూర్యయను ఓదార్చడానికి ఏడుకొండలు ఎంతగానో ప్రయత్నించేడు.

"మంచోళ్ళెక్కువ కాలం బతకర్రా సూరిగా! సీత మహా దొడ్డమనిషి. అదెంతో పున్నెం సేసుకుంది. అందుకనే అది నీ సేతులమీదుగా ఎల్లిపోయింది..." అన్నాడు.

లోకంలోని సుఖదుఃఖాలతో, కష్టనష్టాలతో తనకు ప్రమేయం లేదన్నట్టుగా కాలం గడిచిపోతుంది.

సూర్యుడు తన ప్రతాపం చూపించసాగేడు.

పేవ్‌మెంట్ వచ్చే పోయే జనంతో రద్దీగా తయారయింది. రోదిస్తున్న సూరయ్యనూ, సీత శవాన్నీ చూసి కొందరు జాలి పడుతూ వెళుతున్నారు.

పేవ్‌మెంట్ ప్రక్కనున్న షాపులు తెరిచేరు. సీత శవానికి ఎదురుగా వున్న షాపు యజమాని కొద్దిసేపు ఓపికపట్టి, సూరయ్యను పిలిచేడు.

"రేయ్! ఇంకా ఎంతసేపు ఆ శవాన్ని అక్కడుంచుతావ్? శవం అడ్డంగా వుంటే నా షాపుకెవరొస్తారు? మున్సిపాల్టీవాళ్ళను పిల్చుకురా. వాళ్ళే శవాన్ని తీసుకు వెళతారు" అన్నాడు.

షావుకారు మాటలకు ప్రక్కలో బాంబులు పడ్డట్టుగా అదిరిపోయేడు

సూరయ్య. వినకూడని విషయా న్నేదో విన్నవాడిలాగ వణికి పోయాడు.

దుఃఖం మరింత ఎక్కు వయింది.

'సీత తన పేనానికి పేనం! దేవత!!

అట్టాంటి దేవతను మునిసి పాలిటీ ఓళ్ళ సేతుల్లో పెడతాడా? ఈల్లేదు.తన సేతుల మీదుగానే సాగ నంపాలి. అది తనకు సేసిన సేవను మరిసిపోగూడదు. మడిసి పుట్టుక పుట్టేక ఉసోసంలేని జల్మెందుకు?' ఆలోచనల్లోనుండి బయటపడుతూ షావుకారు వేపు చూసాడు.

"అలా తెల్ల మొగం వేసి చూస్తా వేంరా? వెళ్ళి మున్సిపాల్టి వాళ్ళను పిల్చుకురా!" గదమాయించేడుషావు కారు.

"సెమించండయ్యా! దిక్కు లేని దానిలాగ నా సీతను మునిసి పాలిటీ వోరికి వొప్పగించలేను.... నా సేతులు రావడంలేదుబాబయ్యా" అన్నాడు.

"అయితే ఏం చేస్తావ్? ముందు ఆ శవాన్ని యిక్కడ్నుంచి తీసెయ్" అన్నాడు కాస్తంత చిరాకు కనపరుస్తూ.

"నా సేతులాడ్డం లేదుబాబూ! మునిసిపాలిటీ వోరికి కబురు సెయ్యలేను...దిక్కులేని దాన్లాగ దాన్ని యిడిసిపెట్టి ఎల్లలేను...." అన్నాడు శోకభారంతో. భుజం మీదవున్న మురికిగుడ్డను తీసి కళ్ళు తుడుచుకున్నాడు.

"నువ్వుపిలవకపోతే ఆ పుణ్యం నేనే కట్టుకుంటాను. వెధవ్వేషా లెయ్యక ముందు ఆ శవాన్ని యిక్కడ్నుంచి తీసెయ్ .... లేదా పోలీసుల్ని పిలుస్తాను." గట్టిగా గదమాయించేడు షావుకారు.

అంతవరకూ వాళ్ళ మాటలు వింటూ ప్రేక్షకుడిలాగ నిలబడి పోయిన ఏడుకొండలు, సూరయ్య దగ్గరకువచ్చి భుజంమీద చెయ్యి వేసేడు.

"పదరా సూరిగా! పెద్దోళ్ళతో మనకు తగాదాలేటి? శవాన్ని సాపుకి ఎదురుగా వుంచితే ఆళ్ళకెట్టా కుదు రుద్ది? ఆ సందువరకు తీసుకుపోయి ఆలోచిద్దాం" అన్నాడు.

సీత శవాన్ని సందుచివరవరకు ఏడుకొండలే మోసుకువచ్చి, అక్క డున్న సత్రం అరుగుమీద దించాడు.

సూరయ్య దేకురుకుంటూ అక్కడకు వచ్చేడు.

"ఏ దిక్కూలేని నన్ను తన పేనంలాగ సీత సూసుకుంది. మాఁవా! సివరకి దాన్ని పిడికెడు బుగ్గి సెయ్యడానికి నాకు దారి

కనబడ్డంలేదు. ఆ మునిసిపాలిటీ వోరికి సీత నొప్పజెప్పడానికి నా మనసొప్పట్టంలేదు మాఁవాఁ" అవే దనగా అన్నాడు సూరయ్య.

సూరయ్య బాధను ఏడు కొండలు అర్థం చేసుకున్నాడు. జేబులో నుండి రూపాయి కాగి తాలను తీసి లెక్క పెట్టేడు.

ఎనిమిది వున్నాయి. వాటిని సూరయ్య చేతిలో పెట్టేడు.

"నాదగ్గర ఇంతే వుందిరా సూరిగా!.... కాస్సేపు ఓపికపట్టు, డబ్బు తీసుకువస్తాను" అని చెప్పి వెళ్ళిపోయేడు.

* * *

మనిషిని మింగిన కొండ చిలువ లాగ కాలం నెమ్మదిగా కదులు తుంది.

రోడ్డుమీద రద్దీ రానురాను ఎక్కువవుతోంది.

పగిలిన గుండెతో, కన్నీరు నిండిన కళ్ళతో సీత ముఖాన్ని చూస్తూ, ఏడుకొండలు రాకకోసం ఎదురు చూస్తూ దిగులుగా కూర్చు న్నాడు సూరయ్య.

క్షణాలు....

నిమిషాలు....

గంటలు....భారంగా గడిచి పోతున్నాయి. ఏడుకొండలు జాడ లేదు.

పొద్దు వాలుతున్న కొద్దీ, సూరయ్యకు ఆందోళన ఎక్కువ కాసాగింది. మనసు ఏదో కీడును శంకించ సాగింది.

'ఉదయాన్నే పైసల కోసం ఎల్లినోడు ఇంకా రానేదేటి సెప్మా?' అనుకుంటూ ఏడు కొండలు రాకపోవడానికి గల కారణాలను రకరకాలుగా వూహించుకుంటూ, తన దుర దృష్టాన్ని తిట్టుకుంటూ,నిస్సహాయ తను నిందించుకుంటూ, మనసు లోనే కుళ్ళి-కుళ్ళి ఏడుస్తూ, గాజు బారిన కళ్ళతో, నిస్తేజమైన చూపులతో రోడ్డుమీదకు చూస్తూ కూర్చున్నాడు సూరయ్య.

జారిపోతున్న ఆశలాగ, పశ్చిమ దిక్కున అస్తమిస్తున్న సూర్యుడు—

వెలుగును మెలమెల్లగా కబళి స్తున్న చీకటి—

కొడిగడుతున్న దీపంలాగ—

చావుబ్రతుకుల మధ్య వూగిస

లాడుతున్న ప్రాణిలాగ....మిణుకు మిణుకుమనే ఆశ—

ఏడుకొండలు రాడేమోనన్న ఆందోళన,...ఆరాటం....

క్షణాలు యుగాల్లాగా దుర్భరంగా, దుస్సహంగా గడుపుతున్నాడు సూరయ్య.

రోడ్డుమీదకు ఏక దీక్షతో చూస్తున్న సూరయ్య ఉలిక్కిపడ్డాడు.

పోలీస్ జీప్ రోడ్డుమీద రివ్వుమంటూ దూసుకు పోతుంది.

పోలీసుల మధ్య సంకెళ్ళతో ఏడుకొండలు కూర్చున్నాడు.

ఆ దృశ్యం చూడగానే సూరయ్య నవనాడులూ కృంగిపోయాయి. నడి సముద్రంలో కొట్టుకుపోతున్న వాడికి దొరికిన చిన్న ఆధారం కాస్తా చేయి జారినట్లు అయింది.

గుండె లోతుల్లోనుండి దుఃఖం ఎగజిమ్ముకు వచ్చింది.

'దేవుడా! మరింక నాకు దిక్కెవరు!'

సీత అంత్యక్రియల కోసం సొమ్ముతీసుకు రావడానికెళ్ళిన ఏడుకొండలు పోలీసులకు దొరికి పోవడంతో పిచ్చివాడిలాగ జుత్తు పీక్కున్నాడు సూరయ్య.

కళ్ళవెంబడి ధారాపాతంగా కన్నీటి ప్రవాహం!

తన నిస్సహాయతను, దురదృష్టాన్ని తలచుకుంటూ, గుండె లవిసేలాగ రోదించసాగేడు.

శవం ప్రక్కన కూర్చుని ఏడుస్తున్న సూరయ్యను రోడ్డుమీద పోయేజనం చూసి, జాలి పడుతున్నారు.

రాత్రి పది దాటుతుంది.

ఏడ్చి, ఏడ్చి నిస్త్రాణంగా సూరయ్య ఎలక్ట్రికల్ స్థంబానికి చేరగిల బడ్డాడు. మరింక ఏడవడానికి కన్నీరు, సత్తువ అతడిలో లేవు. అందుకనే, మనసులో ఏడుస్తున్నాడు.

మురికి కాలువలోనుండి కప్పల బెకబెకలు. చీకటి నేపథ్యంలో కీచురాళ్ళ ధ్వని వినిపిస్తున్నాయి.

మున్సిపాల్టీ లైటు మిణుకు మిణుకు మంటుంది- లోకంలో ఇంకా కొడిగట్టని కారుణ్యంలాగ.

అలసటతో కళ్ళు మూసుకున్న సూరయ్య "రేయ్!" అన్న

పిలుపుతో బదులుగా కనురెప్ప లెత్తి చూసేడు.

ఎదురుగా షావుకారు!

షాపు కట్టుకుని వస్తూ, ఇంకా శవాన్ని దగ్గరుంచుకుని కూర్చున్న సూరయ్యని చూసి, ఆగేడు.

"తవ(రా బాబయ్యా!" బొంగురు పోయిన స్వరంతో బదులు పలికేడు.

"ఇంకా శవాన్ని ఎవరూ పట్టుకు పోలేదట్రా?"

"లేదు బాబూ! కట్టుకున్నదాన్ని కాటికి పంపలేనిఎదవనై పోయేను." ఏడ్చేడు.

సూరయ్య మాటలకు, ఆ మాటల్లో ధ్వనించిన ఆవేదనకు, నిస్సహాయతకు షావుకారు గుండెల్లో జాలి మెల్లగా కదిలింది.

"శవాన్ని ముందుంచుకుని, చూస్తూ కూర్చుంటే పని జరుగుతుందా? యీ పదిరూపాయలూ నీ దగ్గరుంచు. షాపులన్నీ మూసేస్తున్నారు- త్వరగా వెళ్ళి, వాళ్ళను కూడా కాస్త సాయపడమను. ఎవరికి తోచింది వాళ్ళిస్తారు." సలహా ఇచ్చేడు షావుకారు.

జేబులోంచి పది రూపాయల నోటుతీసి సూరయ్య చేతిలో పెట్టేడు.

సూరయ్య పదిరూపాయల కాయితాన్ని కళ్ళకద్దుకుని, "రచ్చించారు బాబూ! సెర్మం వొలిపి సెప్పులు కుట్టిచ్చినా మీ ఋణం తీరదు" అన్నాడు.

షావుకారు నిష్క్రమించాడు.

సూరయ్య నేల మీద మెల్లగా దేకురుకుంటూ ఇంకా మూయని షాపులకు వెళ్ళి, దీనంగా తన పరిస్థితిని చెప్పుకున్నాడు. షావుకారు నోటి వాక్కో, సూరయ్య అదృష్ట మోగాని వాళ్ళందరూ తమకు తోచింది యిచ్చి పంపించేరు.

గంటసేపట్లో పదిహేను దుకాణాలకు పైగా తిరిగేడు సూరయ్య. మరింక ఏ షాపులూ లేవు. అన్నీ మూసేసారు-ఒక్క 'టీ'కొట్టు తప్ప.

ఆ 'టీ' కొట్టును చూడగానే అంతవరకూ అణగారి వున్న 'ఆకలి' పంజా విప్పింది.

క్రిందటరోజు నుండి తను పచ్చి మంచినీళ్ళయినా ముట్టలేదన్న విషయం గుర్తుకు వచ్చింది.

ఆకలి భరించ శక్యం గాకుండా వుంది.

కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. పెదవులు ఎండిపోయాయి. అప్రయత్నంగా 'టీ' కొట్టు సమీపించాడు సూరయ్య.

ఆ సమయంలో తన ప్రాణంలో ప్రాణంగా భావించిన 'సీత' చనిపోయిందన్న విషయం గుర్తుకు రాలేదు.

సీత శవం దిక్కూ మొక్కూ లేకుండా సత్రం అరుగు మీద పడి వుందన్న సంగతి జ్ఞాపకం లేదు.

ఉదయం నుంచి తను పడిన బాధ, అనుభవించిన నరకం స్ఫురణకు రాలేదు.

అనుబంధాలను- అనుబంధాలు మిగిల్చిన ఆవేదనను....అన్నిటినీ ఆ సమయంలో ఆకలి జయించేసింది.

కంపిస్తున్న చేతులతో జేబులో నుండి డబ్బు తీసి లెక్క పెట్టాడు.

అరవై రూపాయలు!

సీత శవానికి దహన సంస్కారాలు గావించడానికి ఉదారులు యిచ్చిన డబ్బు అది!

'ఈ డబ్బు సరిపోద్ది. సీత ఋణం కాస్తయినా తను తీరుసుకుంటున్నాడు.' ఏదో తృప్తి సూరయ్యా నావహించింది.

మరుక్షణంలో దీపం క్రింద నీడలాగ-తృప్తి వెనుక వెలితి!

"సూరిగా! నీ పెళ్ళాం చనిపోయిందటగా?" పరామర్శించేడు టీ కొట్టువాడు.

"అవును బాబూ!" పెల్లుబుకుతున్న దుఃఖాన్ని అణిచి పెట్టుకుంటూ తలాడించాడు.

"అసలే కుంటోడివి. కంటికి రెప్పలాగ అది నిన్ను యిన్నాళ్ళూ సూసుకుంది. మరింక, నువ్వెట్లాగ బ్రతుకుతావో ఏమిటో?" సానుభూతి చూపించేడు టీ కొట్టువాడు.

ఆ మాటలు సూరయ్య మనసులో తుఫాన్ను సృష్టించేయి.

'టీ' కొట్టువాడు చెప్పింది నిజమే!

రేపట్నుండి తానెట్లాగ బ్రతుకుతాడు....?

భవిష్యత్తు గురించిన బెంగతో,

భయంతో సూరయ్య వణికి పోయాడు.

సీత చనిపోయింది. ఇక తనకు దిక్కెవరు? వేళకు కడుపులో చల్ల కదలనీకుండా అన్నిటినీ అమర్చే దెవరు? ఎవరు? ఎవరు?

జవాబు శూన్యం.

సీత లేని తన జీవితాన్ని వూహించుకుని నీరు కారిపోయాడు సూరయ్య. చల్లనిగాలి వీస్తున్నా సూరయ్యకి చెమట పట్టేసింది.

'రేపట్నుంచి తనెలాగ జీవిస్తాడు? తిండెవరు పెడతారు? తన బ్రతుక్కేది దారి?' బుర్ర వేడెక్కింది.

కడుపులో భగ్గుమనే ఆకలి!

తల పగిలిపోతున్నట్లుగా ఆలోచనల తాకిడి

చేతిలోని నోట్ల వంక చూసాడు.

ఈ డబ్బుతో ఏ రోడ్డు ప్రక్కనో చిన్న దుకాణం పెట్టుకుని తన బ్రతుక్కి ఓ దారి చూసుకుంటే? మునిసిపాలిటీ వారితో చెబితే వాళ్ళు శవాన్ని పట్టుకుపోతారు కదా!

తన ఆలోచనకు తనే భయపడ్డాడు సూరయ్య.

ఆ డబ్బు సీతను దహనం చెయ్యడానికి అడుక్కున్న డబ్బు. ఆ డబ్బు తను ఉపయోగించుకుంటే సీతకు అన్యాయం చేసిన వాడవుతాడు.

తన కడుపు మంటను చల్లార్చుకోవాలన్నా, తన బ్రతుక్కి ఓ దారి చూసుకోవాలన్నా మనసును సంపుకోక తప్పదు.

తన అవిటి బ్రతుక్కి తోడు నీడగా యిన్నాళ్ళూ గడిపిన సీత, చనిపోతూ కూడా 'దారి'ని చూపించి వెళ్ళిపోయింది.

సూరయ్య కళ్ళు చెమర్చాయి. భుజం మీద గుడ్డతో కళ్ళు తడుచుకున్నాడు.

'సీత నిజంగా దేవత!'

బాధగా, బరువుగా నిట్టూర్చాడు సూరయ్య.

చేతిలో నోట్లను జేబులో పెట్టుకుని, అందులో నుండి రూపాయి నోటు తీసి 'టీ' కొట్టువాడికిచ్చి—

"ఓ బన్ను, సింగిల్ 'టీ' యియ్యి" అన్నాడు గాద్గదిక స్వరంతో.